

ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 170 తిరుపతి తేది : శుక్రవారం 09 మే 2025 పేజీలు : 08 ధర : రూ.6

PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISTRICTS

ఆపరేషన్ సిందూర్ 2.0

- లాహోర్ లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రాడార్లను ధ్వంసం చేసిన భారత్
- పాకిస్థాన్ దూకుడుకు ప్రతిగా ఈ ఉదయం భారత సాయుధ దళాల చర్యలు
- పాక్‌లోని పలు ప్రాంతాల్లో ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలే లక్ష్యంగా దాడులు
- భారత సైనిక స్థావరాలపై పాక్ డ్రోన్లు, క్షిపణులతో దాడికి యత్నం

న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మే 08:

పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు భారత్ మరోసారి గట్టిగా బుద్ధి చెప్పింది. నిన్న రాత్రి భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ జరిపిన దాడులకు సమాధానంగా ఈ ఉదయం భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌లోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉన్న ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలపై దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఓ ముఖ్యమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, రాడార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ నుంచి ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీనికి కొనసాగింపుగా, నిన్న రాత్రి పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణుల సాయంతో ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని పలు సైనిక లక్ష్యాలపై దాడులకు విఫలయత్నం చేసింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లూధియానా, అదంపూర్, భటిండా, చండీగఢ్, నల్, ఫలోడి, ఉత్తర్‌లాయ్, భుజ్ వంటి ప్రాంతాలు ఈ లక్ష్యాలలో ఉన్నాయి. అయితే, భారత ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాకిస్థాన్ జరిపిన దాడులకు సంబంధించిన శకలాలు పలుచోట్ల లభ్యమయ్యాయని, ఇవి పాక్ దుశ్చర్యలకు నిదర్శనమని పేర్కొంది.

భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "ఈరోజు ఉదయం భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్థాన్ ఏ స్థాయిలో, ఏ పద్ధతిలో స్పందించిందో, అదే స్థాయిలో, అదే పద్ధతిలో భారత్ ప్రతిస్పందించింది.

మన దాడులతో లాహోర్‌లోని ఒక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైందని విశ్వసనీయంగా తెలిసింది" అని పేర్కొంది.

ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా ఏపీ

- శ్రీసిటీలో ఎల్‌జి యూనిట్‌కు మంత్రి లోకేష్ భూమిపూజ

తిరుపతి-ఆంధ్రనాడు, మే 08:

'రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నాం' అని మంత్రి నారా లోకేష్ అన్నారు. అంతర్జాతీయ స్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ కంపెనీ భూమి పూజను శ్రీసిటిలో గురువారం లోకేష్ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ 'మేం ఈ రోజు ఎల్‌జి యూనిట్‌కు మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. మేడ్ ఇన్ ఆంధ్ర నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబునాయుడు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. మేము సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడమేగాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం' అని అన్నారు. రాబోయే నాలుగేళ్లలో శ్రీసిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హంగ్ జు జియోన్,

- మిగతా 2లో..

రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరు చేర్చండి

- విభజన చట్టాన్ని సవరించండి
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి
- క్యాబినెట్‌లో తీర్మానం
- ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం

అమరావతి -ఆంధ్రనాడు, మే 08:

విభజన చట్టంలో రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరును చేర్చాలని కేంద్ర ప్రభుత్వాని రాష్ట్ర మంత్రి మండలి కోరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. రాష్ట్ర విభజనచట్టం (ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్)లో పేర్కొన్న 'విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని' స్థానంలో అమరావతిని చేర్చాలని ఈ తీర్మానంలో కేంద్రాన్ని రాష్ట్ర మంత్రిమండలి కోరింది. ఈ తీర్మాన ప్రతిని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం పంపనుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ సింధూర్‌కు మంత్రిమండలి సంఘీభావాన్ని ప్రకటించింది. క్యాబినెట్ నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. రాష్ట్రవిభజన అనంతరం పదేళ్లు పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతోందని, అనంతరం అది తెలంగాణ రాజధానిగాఉంటుందని విభజన చట్టంలో పొందుపరిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే 'విభజిత ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఉంటుంది' అని మాత్రమే చట్టంలో పేర్కొన్నారని తెలిపారు. నూతన రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చేలా రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్-5, సబ్ సెక్షన్-2లను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంత్రిమండలి తీర్మానం చేసినట్లు ఆయన వెల్లడించారు.

కేంద్ర కార్మిక చట్టాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా రాష్ట్రంలోని చట్టాలను రూపొందించనున్నట్లు మంత్రి చెప్పారు. దీనిలో భాగంగా రాష్ట్రపతి ఆమోదం కోసం 2019లో

- మిగతా 2లో..

15 నుంచి వాట్సాప్‌లో రేషన్ కార్డుల సేవలు

- డేటాలో లేని 79,173 మంది వివరాల పరిశీలన
- రేషన్ బియ్యం రీసైక్లింగ్ లేకుండా చర్యలు
- సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు

అమరావతి -ఆంధ్రనాడు, మే 08:

రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్‌లో సేవలు అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారు లను ఆదేశించారు. రేషన్ సరుకుల పంపిణీ, దీపం-2, ధాన్యం సేకరణలో లోటుపాట్లు లేకుండా, అవకతవకలు జరగకుండా పునర్ వ్యవస్థీకరించాలన్నారు. సచివాలయంలో పౌరసరఫరాల శాఖపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం ఎక్కడా రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ కార్డుల్లో పేర్లున్నప్పటికీ, జిఎస్‌డబ్ల్యుఎస్ డేటాలో లేని 79,173 మంది వివరాలపై వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 1,46,21,223 రైస్ కార్డులు ఉండగా, అందులో

4,24,59,028 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో ఇప్పటికే 3.94 కోట్ల మంది ఇకెవైసి చేయించుకున్నట్లు చెప్పారు. ఐదేళ్లలోపు చిన్నారులకు, 80 ఏళ్లకు పైబడిన వారికి ఇకెవైసి నుంచి మినహాయింపు ఇచ్చామని, వచ్చే నెల 30 నాటికి రాష్ట్రంలో అందరికీ ఇకెవైసి పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించిందని స్పష్టం చేశారు. ఈ నెల 7 నుంచి కొత్త రైస్ కార్డులు దరకాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. కార్డుల విభజన, సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, వెనక్కి

- మిగతా 2లో..

వేసవిలో తాగునీటి కోసం

ప్రత్యేక ప్రణాళికలు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి -ఆంధ్రనాడు, మే 08

వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని, పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చే కథనాలను పరిశీలించి, ప్రజల ఫిర్యాదులుగా పరిగణిస్తూ తక్షణమే స్పందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంపై మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాల వారీగా వాటర్ వార్ రూమ్స్ ఏర్పాటు చేసిన క్రమంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు

తీసుకోవాలన్నారు. అత్యవసర చర్యల కోసం రూ.28 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యను సమర్థవంతంగా

- మిగతా 2లో..

కేసులతో వేధిస్తున్న వారిని విడిచిపెట్టం

- మాజీ సిఎం వైఎస్ జగన్

అమరావతి -ఆంధ్రనాడు, మే 08:

వైసిపి నాయకుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి దారుణంగా ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి జిల్లాల స్థానిక సంస్థల వైసిపి

- మిగతా 2లో..

మంచి మాట

జీవితంలో గుర్తులు మిగిల్చే వ్యక్తిగా బతుకు, మరకలు మిగిల్చే వారీగా కాదు.

రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరు చేర్చండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వం పంపిన పారిశ్రామిక వివాదాల(ఆంధ్రప్రదేశ్ సవరణ)బిల్లును, కేంద్రహోం మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపిన కార్మిక చట్టాలు (ఆంధ్రప్రదేశ్ నేరాల సమ్మేళనం సవరణ) బిల్లు,ఫ్యాక్టరీల (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు–2019లను ఉపసంహరిచుకుం టున్నట్లు తెలిపారు. ఈ మేరకు చేసిన ప్రతిపాదనను కూడా మంత్రి మండలి ఆమోదించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చే కార్మిక చట్టాలకు అనుగుణంగా వీటిని రూపొందించి మరలా కేంద్రానికి పంపుతామని తెలిపారు.

సిఆర్‌డిఎ కమిషనర్‌కు రూ.1732.306 కోట్లు విలువగల నాలుగు పనుల కోసం స్వల్పధరలను ఆమోదించినట్లు తెలిపారు. ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో అమరావతి నగర అభివృద్ధి కార్యక్రమం కింద డిబివో పద్ధతిలో పనులు చేసేందుకు రూ.560.57కోట్లు, నీటి నిర్వహణ వ్యవస్థ, డిజిటల్ ట్విన్, నీటిసరఫరా కోసం రూ.494.86కోట్లు, రోడ్ల నిర్మాణం కోసం మరో రూ.593.03కోట్లు ఆమోదించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పెద్ద, మధ్య, చిన్న నీటిపారుదల వనరులకు సంబంధించి రూ.345.39కోట్లతో 7174 ఆపరేషన్, నిర్వహణ పనులకు ఆమోదించినట్లు చెప్పారు. నీటి వినియోగదారుల సంఘాలు అందుబాటులో లేని 7 రోజుల్లోపు రూ.10.లక్షల విలువ కంటే పైబడిన పనులకు స్వల్పకాలిక టెండర్ నోటీసును ఆహ్వానించడానికి అనుమతించేందుకు చేసిన ప్రతిపాదనను ఆమోదించామని తెలిపారు. వాణిజ్యేతర ప్రయోజనాల కోసం నీటిపారుదల చెరువుల్లో మట్టితవ్వకం, రవాణాకు రైతులకు అనుమతించినట్లు తెలిపారు. సముద్ర చేపల వేట నిషేధ సమయంలో ఉపశమనంగా అందిస్తున్న సాయానికి 'మెరైన్ ఫిషింగ్ బ్యాన్ రిలీఫ్'గా పేరును పునరుద్ధరించామన్నారు.

నెల్లూరు భూ సేకరణ పరిహారం పెంపు

నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక హబ్ నిర్మాణం కోసం జరుపుతున్న భూసేకరణకు పరిహారాన్ని ఎకరాకు రూ.4లక్షలు పెంచామన్నారు. ఓడరేవులకు సమీపంలో ఉన్న భూములను ఎపిమారిటైం బోర్డు సేకరించిన,భవిష్యత్తులో సేకరించబోయే భూములను, ఉప్పు భూములను ఎపి పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఎపిఐఐసి)కు బదిలీ చేయడానికి ఆమోదం తెలిపామని చెప్పారు.

నెల్లూరు జిల్లా నెల్లూరు బిట్–2 గ్రామంలోని 36 ఎకరాల భూమిని భగత్‌సింగ్ కాలనీ నివాసితుల కోసం పట్టాలు మంజూరు చేసే సులభతర ప్రక్రియను ఆమోదించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిపిడిసిఎల్) సంస్థల ఆస్తులను ఎన్‌పిఎగా ప్రకటించ కుండా ఉండేందుకు జెన్‌కో నుంచి రూ.650కోట్లు మధ్య కాలిక రుణం అందించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. ఎపి పర్యాటక విధానం–2024–29కి అనుబంధంగా తీసుకొచ్చిన ఉపాధి కల్పన ప్రోత్సాహక విధానానికి ఆమోదించామన్నారు. మెగా పర్యాటక ఈవెంట్‌ల నిర్వహణ కోసం ఎపి పర్యాటక ఆథారిటీకి రూ.78కోట్ల బడ్జెట్‌ను కేటాయించామన్నారు.

భూములు కేటాయింపు

వైఎస్ఆర్ జిల్లా కొండాపూర్ మండలంలోని కె బొమ్మేపల్లిగ్రామంలో 191.64 ఎకరాల భూమిని 1000మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు కోసం అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా నెడ్‌క్యాప్‌కు కౌలు ప్రతిపాదికన ఏడాదికి ఎకరానికి రూ.31వేలు చొప్పున 46 ఏళ్లు పాటు కేటాయించడానికి చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

అంబేద్కర్ కొనసీమ జిల్లా చిర్రయనం గ్రామంలో 1.05 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫ్లూటన్ అక్వా ఎల్ఎల్‌పికి ఏడాదికి రూ.2.50లక్షల లీజు చొప్పున 15 ఏళ్లపాటు కేటాయింపు.

కర్నూలు జిల్లా బి తండ్రపాడులో 1.95 ఎకరాల భూమిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు రూ.61,23,516ల చొప్పున భూ బదలాయింపు.

విశాఖపట్నం జిల్లాలోని అన్నవరం గ్రామంలో 18.70 ప్రభుత్వ భూములను బీచ్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు కోసం ఎపి టూరిజం అథారిటీకి బదిలీ.

చిత్తూరు జిల్లా కుప్పం మండలం పాలర్లపల్లె గ్రామంలో 18.70 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ఎపిఐఐసికి ఉచితంగా బదిలీ

ఏపీ మాజీ సీఎంను కలిసిన వైసీపీ నాయకులు

రామకుప్పం– ఆంధ్రనాడు, మే 08: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్, మాజీ రెస్కో చైర్మన్ సందిల్ కుమార్ఆధ్వర్యంలో రామకుప్పం మండలం వైసిపి కన్వీ నర్ బాబు రెడ్డి బందార్లపల్లి సర్పంచ్ రాజగోపాల్ ఎంపిటిసి సౌమ్య, మాజీ రెస్కో డైరెక్టర్ రవి నాయక్ ఇంకా పలువురు వైసీపీ నాయకులు కలిసినారు కుప్పం నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారిని ఆదేశించారు.

ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

కొరియా రాయబారి లీ సియాంగ్ హూ, ఎలక్ట్రానిక్స్ హెూం సొల్యూన్స్ సిఇఒ జేచియోల్ లియు, ఎకో సొల్యూషన్స్ సిఇఒ జేసంగ్‌ల, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జులై నుంచి అర్హులందరికీ పింఛన్లు

జులై నుంచి అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని, వచ్చే రెండు నెలల్లో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. సత్యవేడు నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం రెండో రోజు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. శత్రువులపై పోరాటానికి ప్రధాని నరేంద్రమోదీ ఏ నిర్ణయం తీసుకున్నా అండగా నిలుస్తామన్నారు. అంతకుముందు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమావేశం అనంతరం విజయవాడకు చేరుకున్నారు.

కేసులతో వేధిస్తున్న వారిని విడిచిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అదే స్ఫూర్తితో మూడేళ్లూ పనిచేయాలని తెలిపారు. చంద్రబాబునాయుడు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని, అధికారం కోసం అనైతిక వ్యవహారాలు, అంతులేని అరాచకాలు చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, వ్యవసాయం సర్వనాశనం అయిందని పేర్కొన్నారు. పిల్లలు చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. వైద్యం కోసం పేదలు ఆస్తులు అమ్ముకుంటున్నారని, పెట్టుబడిసాయం లేక రైతులు విలవిల్లాడుతున్నారని అన్నారు. వైసిసి నాయకులను వేధిస్తున్న, ఇబ్బంది పెడుతున్న పోలీసుల అధికారుల పేర్లు రాసుకోవాలని, అధికారం వచ్చాక వారిని విడిచిపెట్టబోమని, చట్టం ముందు నిలబెడతామని అన్నారు. మద్యాన్ని ఊరూరా బెల్టుషాపులు పెట్టి డోర్ డెలివరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లేని స్కాములు ఉన్నట్లు చూపిస్తున్నారు : పుత్తా

రాష్ట్రంలో జరగని స్కాములు జరిగినట్లు చూపిస్తున్నారని, దాని పేరుతో జగన్‌కు అనుకూలంగా ఉన్న వారి ఇళ్లలో తనిఖీల పేరుతో పోలీసులు వేధింపులకు దిగుతున్నారని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ అక్రమాలకు బయటపెడుతున్న పత్రికల సంపాదకుల ఇళ్లపైనా దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు.

వేసవిలో తాగునీటి కోసం

ప్రత్యేక ప్రణాళికలు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించేందుకు యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. క్లిష్టమైన ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడం, ప్రైవేటు నీటి వనరులను అద్దెకు తీసుకోవడం, తాత్కాలిక నీటి సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయడం, సమ్మర్ స్టోరేజి ట్యాంకులు ఎప్పటికప్పుడు నింపడం, నీటి సరఫరా వ్యవస్థలు, చేతి పంపులకు మరమ్మతులు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'హంద్రీనీవా సుజల స్రవంతి' పూర్తికి సీఎం చంద్రబాబు సంకల్పం

- ఫేజ్ - 1, 2 కింద 554 కి.మీ మేర కాలువ పనులకు రూ.3,873 కోట్లు కేటాయింపు
- కాలువ వెడల్పుతో 3,850 క్యూసెక్కులకు పెరగనున్న నీటి సామర్థ్యం
- 5 నెలల కాలంలో లక్ష్యం మేర పనులు.. వచ్చే నెలకల్లా మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత టీడీపీ హాయంలో హంద్రీనీవా ప్రాజెక్టుపై రూ.4 వేల కోట్లు పైగా ఖర్చు...
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ శరవేగంగా పనులు

అమరావతి–ఆంధ్రనాడు, మే 08:

రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి నిర్మాణం పనులు వేగవంతం చేసి... త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలగా ఉన్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు నిర్మాణం పనులను స్వయంగా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి శుక్రవారం అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అక్కడ పనులను పరిశీలించి... అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వేగంగా పనులు చేపట్టినా... 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపించింది. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నాశనం చేసినట్టుగానే హెచ్ఎన్ఎస్ఎస్‌ను కూడా పక్కన పెట్టేసింది. కాలువ విస్తరణ, లైనింగ్‌కు సంబంధించి ఎలాంటి పనులు చేయలేదు. రాయలసీమ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు ఎంత ప్రయోజనమో తెలిసి కూడా పట్టించుకోలేదు. 2024లో హెచ్ఎన్ఎస్ఎస్‌కు పట్టిన గ్రహణం తొలిగిపోయింది. కూటమి విజయంతో ఈ ప్రాజెక్టు పనులు మళ్లీ వేగం పుంజుకున్నాయి. దశాబ్దాల ఆకాంక్ష త్వరలోనే సాకారం కానుంది. కూటమి ప్రభుత్వం రాగానే హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కాలువ, పుంగనూరు బ్రాంచ్ కాలువ లైనింగ్ – వెడల్పు పనులకు ముఖ్యమంత్రి పరిపాలనా అనుమతులిచ్చి పట్టాలెక్కించారు. 2025 జూన్ నాటికి ఫేజ్–1 పూర్తయ్యేలా ముఖ్యమంత్రి అధికారులకు ఇప్పటికే లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనిలో భాగంగా కొద్దినెలలుగా పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి.

2014 – 2019 మధ్య కాలంలో :

2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల పాటు హంద్రీనీవా ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగాయి. ప్రాజెక్టు సామర్థ్యానికి తగ్గట్టు కాలువలు లేకపోవడంతో డిజైన్‌లో మార్పు చేసి హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కాలువను వెడల్పు చేయాలని అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు.

కాలువను వెడల్పు చేసే పనులు ఏప్రిల్ 2017లో చేపట్టారు. గొల్లపల్లి రిజర్వాయర్, మడకశిర బ్రాంచ్ కాలువ పనులు 2016–17లో పూర్తయ్యాయి. కియా పరిశ్రమలకు నాడు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచే నీరివ్వడం జరిగింది. చెర్లోపల్లి, మారాల రిజర్వాయర్లు 2018–19లో పూర్తయ్యాయి. 2019లో మొదటిసారిగా ఎంబీసీ, పీబీసీకి నీరు విడుదల చేశారు.

ఈ 5 నెలల్లో పనుల్లో పురోగతి :

హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కాలువ, పుంగనూరు బ్రాంచ్ కాలువ లైనింగ్ పనులకు పరిపాలనా అనుమతులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంజూరు చేసింది. మొదట కాలువలకు లైనింగ్ లేకుండా నిర్మించడంతో గరిష్ట ప్రవాహం కేవలం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండేది. 3850 క్యూసెక్కుల సామర్థ్యం కలిగేలా... కాలువలను విస్తరించి, లైనింగ్ పనులు చేపట్టారు. 5 నెలల కాలంలో లక్ష్యం మేర పనులు జరిగాయి. వచ్చే నెలకల్లా మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫేజ్–2 కాలువల (పుంగనూరు, కుప్పం బ్రాంచ్‌లు) పనులు వేగంగా జరుగుతున్నాయి. పాడెర, మడకశిర, కుప్పం వంటి ప్రాంతాలకు నీరు చేరేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు.

హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు లక్ష్యం :

ప్రాజెక్టు పూర్తయితే ఫేజ్–1 కింద కర్నూలు జిల్లాలో 77,094, నంద్యాల జిల్లాలో 2,906, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలు... మొత్తం 1,98,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఫేజ్–2 కింద అనంతపురం జిల్లాలో 33,617, సత్యసాయి జిల్లాలో 1,93,383, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాలు కలిపి మొత్తం 4,04,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో 6,02,500 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. మొత్తం 81 మండలాల్లో 33 లక్షల మందికి తాగునీటి సరఫరాకు అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు పనుల స్వయంగా పరిశీలించి ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.

15 నుంచి వాట్సాప్‌లో రేషన్ కార్డుల సేవలు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడం వంటి ఏడు సర్వీసులను అందుబాటులోకి తెచ్చామన్నారు. గడచిన ఖరీఫ్ సీజన్‌లో 35.94 లక్షల మెట్రిక్ టన్నులు, రబీ సీజన్‌లో 14.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని అధికారులు సిఎంకు వివరించారు. రైతులకు ఖరీఫ్‌లో రూ.8,278 కోట్లు, రబీలో రూ.3,076 కోట్లు ధాన్యం సేకరణ కోసం చెల్లించినట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రంలో రహదారులను అత్యుత్తమ నాణ్యత – నిర్వహణ కలిగి ఉండేటా తీర్చిదిద్దాలని, చేపట్టిన రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖపై గురువారం ఆయన సమీ క్షించారు.

ప్రతి రహదారి పనులకు డెడ్‌లైన్ నిర్ధేశించి, అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని సిఎం అన్నారు. వర్షాకాలం రాకముందే రోడ్ల నిర్మాణం పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. 8,744 కిలోమీటర్ల వరకూ రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు జాతీయ స్థాయిలోనే అత్యుత్తమంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పూర్తిగా పాడైన 2,683 కిలోమీటర్ల రహదారులను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఆర్ అండ్ బిలో 304 ఖాళీ ఎఇ పోస్టుల్లో గ్రామ వార్డు సచివాలయాల శాఖలోని సివిల్ ఇంజనీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రూ.860 కోట్లతో 20,060 కిలోమీటర్ల పొడవునా గుంతలు లేకుండా చేపట్టిన మరమ్మతు పనులు 97 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు సిఎంకు వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎఐ, రోడ్లు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు సంబంధించి రూ.78,295 కోట్లతో 3,510 కిలోమీటర్ల పొడవైన 146 పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిలో రూ.11,682 కోట్లతో చేపట్టిన 546 కిలోమీటర్ల మేర 22 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది మరో 46 పనులు పూర్తవుతాయన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

- ఇంటికో పారిశ్రామిక వేత్తను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రాథమిక టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పలమనేరు- ఆంధ్రనాడు, మే 08: స్థానికంగా మనకున్న అవకాశా లను అంది పుచ్చు కుని మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా సాధికారతలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాథమిక టైలరింగ్ శిక్షణను పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం ఉద్దేశాన్ని డిఆర్డిఏ పిడి శ్రీదేవి మహిళలకు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరమైందన్నారు. ప్రాథమిక టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలకు కుట్టు, డిజైన్ నైపుణ్యాలను అందించడంతో వారికి ఆర్థిక, మహిళా సాధికారత కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబనతో పాటు తక్కువ పెట్టుబడితో జీవనోపాధి అవకాశాలు, గ్రామీణ, పట్టణ పేద మహిళలకు ఆదాయ మార్గంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో టెక్స్ టైల్ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద కంపెనీలు ముందుకు వస్తున్నాయని దీంతో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంద న్నారు. కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణ రెడ్డి, ఎంపీడీఓ ఖాదర్ భాషా, బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, నాయకులు నాగరాజు రెడ్డి, అర్బీసి కుట్టి, గిరిబాబు, ఖాజా, నాగరాజు, మదన్, కిరణ్, బీఆర్సీ కుమార్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

11న 'తల్లికి పాదపూజ'



పలమనేరు-ఆంధ్రనాడు, మే 08 : ఈ నెల 11న ఆదివారం పలమనేరు సేవారత్న అవార్డు గ్రహీత శ్రీపు రం సీతారామయ్య శెట్టి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మాతృ దినోత్సవం పేరిట ఓ విశిష్ట కార్యక్రమం జరుపనున్నారు. ఈ సందర్భంగా శ్రీపురం సీతారామయ్య శెట్టి మాట్లాడుతూ.... సృష్టిలో తల్లికి మించిన దైవం లేదని అన్నారు. మా తల్లి దండ్రులు స్వర్గీయ శ్రీపురం రంగనాయకమ్మ,శ్రీపురం చంద్రయ్య శెట్టి లు ఈ ప్రాంతంలో అందరికీ సుపరిచితులేనన్నారు. ఈ నేపథ్యంలో మా తల్లి పేరు మీద 2018వ సంవత్సరంలో ఇక్కడి పట్టణము నందు 140 మంది తల్లులను రప్పించి వారి కొడుకు లేదా కూతురుతో మాతృ దినోత్సవం పేరిట కార్యక్రమం సాంప్రదాయ ప్రకారం జరిపించామన్నారు.తల్లి యొక్క ప్రాధాన్యత, బిడ్డలకు తల్లికి గల సంబంధాన్ని వివరిస్తూ శాస్త్ర ప్రకారం పండితుడితో చెప్పించి ఆశీర్వచనాలు అందుకొంటూనే తల్లికి బిడ్డ చేత పాదపూజ జరిపించామన్నారు. వారికి చివరగా చీర, శాలువా, గొడుగు, పండు పూలు అందించి సత్కరించడం, భోజనం పెట్టి పంప డం జరిగిందన్నారు. అలాంటి కార్యక్రమమే 150 మంది తల్లులకు వారి బిడ్డ చేత పాదపూజాది కార్యక్రమాలు ఈ ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్థానికంగా చేపడుతున్నామన్నారు. కనుక ఈ కార్యక్రమానికి అందరూ తప్పక హాజరై వీక్షించాలని ఆయన కోరారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు

- అడవిలో ఏనుగులకు ఆహారవసతి కల్పించాలి
- సీఎం బాబు స్పందించి ఏనుగులకు ఆహారం వసతిపై దృష్టి పెట్టాలి

రామకుప్పం- ఆంధ్రనాడు, మే 08: రామకుప్పం మండలంలోని రామా పురం తండా పరిసర ప్రాంతాల్లో రెండు ఏనుగులు వరి పంట బీన్స్ టమాటా పంటలను రాత్రివేళ ధ్వంసం చేశాయి. రైతులు వీటిని అడవి పక్క తరుముటానికి విశ్వ ప్రయత్నం చేశారు. కానీ డప్పుల శబ్దం ఎక్కువ చేయడంతో అవి అడవి బాట పట్టాయి అడవి ఏనుగులు ఇటీవల అడవి సమీప గ్రామాల పంటలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయి. అధి కారులు తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతు న్నారు. ఏనుగులు అడవిలో నుంచి వెలుపలకు రాకుండా ఉండేందుకు ఆహారం కొరకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూక్ష్మ ప్రణాళిక ద్వారా తయారు చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో అది మూలను పడింది ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏనుగులకు ఆహారం కొరకు ఎకో టూరిజం ద్వారా అడివిలో ఏనుగు లకు ఆహారం నేరేడు చెరుకు ఇంకా ఇతర పంటలను సాగు చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటే బావుంటుందని ప్రజలు కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యం

- ఇన్వెస్ట్‌మెంట్, ఇండస్ట్రీస్‌తోనే రాష్ట్రాభివృద్ధి
- పరిశ్రమల స్థాపనకు పలమనేరు అన్ని విధాలా అనుకూలం
- ఎయిర్, పోర్ట్, రోడ్ కనెక్టివిటీ అవకాశం ఉన్న ప్రాంతం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇంటికో పారిశ్రామిక వేత్త తయారు కావాలి
- రూ. 15.27 కోట్ల ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అమర్

పలమనేరు- ఆంధ్రనాడు, మే 08: స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగా నియోజక వర్గానికి ఒక ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రిన్యూర్) పార్కును ఏర్పాటు చేయడం జరుగుతుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణ సమీపం లోని నాగ మంగళం వద్ద రూ.15.27 కోట్లతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఎంఎస్ఎంఈ పార్క్‌కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పరిశ్రమలు, పెట్టుబడులు వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించి ప్రతి ఇంట్లో పారిశ్రామిక ఉత్పత్తి తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలను ఇచ్చి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదన్నారు. రాష్ట్రంలోనే పలమనేరు ప్రాంతం పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలుగా అనుకూలమైన ప్రాంతమని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న ఈ ప్రాంతానికి అన్ని విధాల రోడ్డు సౌకర్యంతో పాటు పోర్టు సౌకర్యము, ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ ఉన్నందున పరిశ్రమల స్థాపనకు చాలా అనుకూలమని వివరించారు. భవిష్యత్తులో పలమనేరు ప్రాంతం మంచి ఇండస్ట్రియల్ క్యారిడారుగా కాబోతుందని కనుక ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్థానికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. ముఖ్యంగా పెద్ద నగరాలైన చెన్నై,బెంగళూరులలోని పారిశ్రామికవేత్తలు రూరల్ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూస్తున్నారని అలాంటి వారికి ఈ ప్రాంతం భవిష్యత్తులో చాలా అనుకూలంగా మారనుందన్నారు.

ఈ మధ్యనే తిరువూరుకు చెందిన ప్రముఖ టెక్స్టైల్ కంపెనీ ఈ ప్రాంతంలో తమ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడాన్ని ఆయన గుర్తు చేశారు. కుప్పం, బైరెడ్డిపల్లి,వి.కోట ప్రాంతాలు హార్టికల్చర్ పంటలకు అనుకూలం కావడం చేత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.కనుక ప్రభుత్వం సరళతరంగా ప్రోత్సాహాలనందిస్తూ చేపడుతున్న కార్యక్రమా లను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటికో పారిశ్రామికవేత్తలుగా ఈ ప్రాంత వాసులు ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమాల్లో పలమనేరు ఆర్డివో భవాని, తహసీల్దార్ ఇన్న నాథన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, డిఐసి జనరల్ మేనేజర్ సూరి బాబు, డిప్యుటీ జోనల్ మేనేజర్ భార్గవి,అసిస్టెంట్ మేనేజర్ ఇస్మాయిల్, ప్రాజెక్టు ఇంజినీర్ ప్రవీణ్, లైజనింగ్ ఆఫీసర్ లోకేష్, ఐపీవో రామాంజులు, పలమనేరు కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, రంగనాథ్, నాగరాజు రెడ్డి, ఆర్.బి.సి కుట్టి లతో పాటు నాయకులు గిరి, ప్రతాప్ రెడ్డి, పలమనేరు ఆటోనగర్ అండ్ ఎంఎస్ఎంఈ యూనియన్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి,జగదీష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ జాబితా తయారు చేయండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ - ఆంధ్రనాడు, మే 08: పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ చేయడంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం లో జిల్లా లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డి ఆర్ ఓ కె. మోహన్ కుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు బిఎల్ఓలు క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎస్ సి డి 3.0 సర్వే చేయడం జరుగుతున్నదని, తద్వారా ప్రతి కుటుంబం లోని వివరాలను సేకరించడం జరుగుతున్నదని, మరణించిన వారి వివరాలు కూడా వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఉంటాయని, వారితో ఎలెక్షన్ సెల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రతి నియోజకవర్గంలో సచివాలయం వారీగా మరణించిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించే ప్రక్రియ ప్రారంభించాల న్నారు. ఫారం 6 కింద 3,595 అందగా 2297, ఫారం 7 కింద 3,034 దరఖాస్తులు అందగా అందులో 1,889, ఫారం 8 కింద 5,304 దరఖాస్తులు అందగా 4,177 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందన్నారు. మరణించిన, మల్టిపుల్ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి పార్టీ ప్రతినిధి సురేంద్ర కుమార్, పోలింగ్ స్టేషన్ లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్లు నమోదైన వారికి కార్డుల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని బిజెపి పార్టీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజక వర్గానికి ఓటర్ల జాబితాలో పేర్లను మార్పుకు సంబంధించి అంశాలను పరిశీలించాలని సిపిఎం పార్టీ ప్రతినిధి గంగరాజు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైన వైఎస్ఆర్ సిపి ఎన్. ఉదయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి, జనసేన ప్రతినిధి యశ్వంత్, బిఎస్పి ప్రతినిధి భాస్కర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీసత్యనారాయణ స్వామి వారి కళ్యాణోత్సవం

- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, భక్తులు - పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ

మదనపల్లి -ఆంధ్రనాడు, మే 08: మదనపల్లి మండలం, చిప్పిలిలో చిట్టి అన్నవరంలో గల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో సత్య నారాయణ స్వామి వారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. గురువారం ఆలయ కమిటీ అధ్యక్షులు కంచేపల్లి అమరనాథ్ మరియు కమిటీ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో సుప్రభాతం, శ్రీ రమాదేవి సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వార్లకు పంచామృతాభిషేకం, శ్రీ ఉమామహేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, వేద పఠనం, మంత్రపుష్ప సమర్పణ, శ్రీ వరసిద్ధి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అలంకరణ, నూతన వస్త్రధారణ కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా శ్రీ మహా గణపతి హోమం, పూర్ణాహుతి అనంతరం శ్రీ రమాదేవి సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవ కార్య క్రమం ఆధ్యాత్మిక పండుగ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పెద్దఎత్తున జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఫణితేజ శర్మ, పురో హితులు దుర్గరాజు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కంచేపల్లి అమరనాథ్, ప్రధాన కార్యదర్శి వైధ్యం రామకృష్ణ శర్మ,ఆలయ కోశాధికారి విరూపాక్షం దివాకర, మరియు మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.సాయంత్రం చిప్పిలి గ్రామంలో శ్రీ సత్య నారాయణ స్వామి గ్రామోత్సవం ఆధ్యాత్మిక వాతా వరణంలో భక్తాదులు ఆలయ కమిటీ పర్యవేక్షణలో ప్రదర్శన శోభాయమానంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి కృపాకటాక్షానికి పాత్రులయ్యారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వైధ్యం రామకృష్ణ శర్మ మాట్లాడుతూ స్వామివారి వార్షిక కళ్యాణోత్సవం జయప్రదం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక వసతులు కల్పనకు దాతలు,భక్తులు విరాళాలు అందించి తోడ్పాటునివ్వాలని కోరారు.స్వామివారి సేవ కోసం భక్తులు అందించిన కానుకలను వినియోగిస్తున్నామని వెల్లడించారు.పాలక మండలి సభ్యులు మునుగోటి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాల కాలంగా ప్రతి ఏటా ఆనవాయితీగా స్వామివారి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం చేసే స్వామివారిగా భక్తుల ప్రగాఢ విశ్వాసమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గడిచిన రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజలు, హోమాలు, స్వామివారి వార్షిక కళ్యాణోత్సవంతో పాటు గ్రామోత్సవం, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించామని తెలిపారు.

12 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో పరీక్షలకు హాజరుకానున్న 15,377 మంది విద్యార్థులు
- జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 08: ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుండి మే 20 వ తేదీ వరకు నిర్వహిం చడం జరుగుతుందని, సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలో ని డి ఆర్ ఓ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పై ఇంటర్మీడియట్ విద్య, రెవిన్యూ, పోలీస్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో మే 12 నుండి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను డిఈఓ, రెవిన్యూ, పోలీస్, ఏపిఎస్ఆర్టిసి, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించిన 35 పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పరీక్షా సమయాలలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పోలీస్ వారి సమన్వయంతో ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్లను ఫ్లైయింగ్ స్క్వాడ్ లుగా నియమించాలని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఉ.6 గం. ల నుండి రవాణా సౌకర్యం కల్పించాలని ఏపిఎస్ఆర్టిసి అధికారులను, అత్యవసర వైద్య సేవలకు నర్స్‌లు, ఏఎన్ఎంలను నియ మించాలని వైద్య శాఖ అధికారులను, పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా విద్యుత్ శాఖ చూసుకోవాలని, పరీక్షా పత్రాలను నిర్దేశిత పోస్ట్ ఆఫీస్ లకు చేర్చేలా పోస్టల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మొదటి సంవత్సరం పరీక్షా సమయం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గం. వరకు రెండవ సంవత్సరం పరీక్షలు మ.2.30 నుండి సా.5.30 గం. వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జనరల్, ఓకేషనల్‌కు సంబంధించి ప్రాక్టీకల్ పరీక్షలు మే 28 నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలలో 170 కళాశాలకు సంబం ధించి జనరల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 10,236, రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరు కనుమ నారాయణ తెలిపారు.

చెంబకూరు వైసీపీ నాయకులు షంషీర్‌కు మాతృవియోగం

- పరామర్శించిన మదనపల్లె వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్

మదనపల్లి –ఆంధ్రనాడు, మే 08: నియోజకవర్గంలోని రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షంషీర్ తల్లి అనారోగ్యం, వయోభారం కారణంగా కన్నుముశారు. విషయం తెలుసుకున్న మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ షంషీర్ స్వగృహానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిస్సార్ అహమ్మద్ తోపాటు మస్తాన్, యూనస్, మల్లికార్జున, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వెలుగు ప్రత్యేక పాఠశాలలో అన్నవితరణ

- అభినందించిన సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి

మదనపల్లి –ఆంధ్రనాడు, మే 08: పట్టణంలోని అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థలో గురువారం తంబళ్లపల్లి గృహనిర్మాణ శాఖ డీ.ఈగా విధులు నిర్వహిస్తున్న ఎద్దులవాని వెంకట రెడ్డి మదనపల్లె పట్టణం,రెడ్డీస్ కాలనీలో గృహప్రవేశం చేశారు.దీనిని పురస్కరించుకొని వెలుగు చిన్నారులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి నూతనంగా నిర్మించిన భవనాన్ని సందర్శించి వెంకట రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపి విందులో పాల్గొన్నారు. వెలుగు చిన్నారులు,వృద్ధులు కలసి పదిమంది మంచికోరే మీరు పదికాలాల పాటు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యా లతో సదాకలం జీవించాలని కోరారు. అధికారులు శుభకార్యాలను నిరాడంబరంగా చేసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సాంఘిక మాధ్యమాల్లో దుష్ప్రచారం సరికాదు

- అనవసర ప్రచారంతో పార్టీ ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం
- టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్

మదనపల్లి –ఆంధ్రనాడు, మే 08: అన్నమయ్య జిల్లా ఎపిఎస్‌పిడిసిఎల్ లీగల్ సెల్ ప్రతినిధిగా జి.దినేష్ కుమార్ రెడ్డి నియామకంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రమేయం లేదని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు.

గురువారం నిమ్మనపల్లి సర్కిల్ టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీలో క్రియాశీలకంగా మదనపల్లె పట్టణానికి చెందిన దినేష్ కుమార్ రెడ్డికి అధికారిక పదవి కేటాయించారని తెలిసిన వెంటనే టిడిపి శ్రేణులు నిరసనలు తెలపడంతో ఆ పదవిని నిలుపుదల చేసినట్లు పార్టీ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దినేష్ కుమార్ రెడ్డి తనకు జిల్లా లీగల్ సెల్ ప్రతినిధిగా పదవి లభించందని ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలవడంతో ఆయన ఆశ్చర్యపోయారన్నారు. తనకు తెలియకుండా మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తికి పదవులు రావడం పట్ల ఆయన ఆరా తీశారు. తన కార్యాలయం నుండి పొరపాటున సిఫారసు లెటర్ ఇచ్చారా అని పీఏలను వివరణ త్వరగా వారు ఎవరికి లెటరు ఇవ్వలేదని తెలియజేశారు. కొందరు దినేష్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే కలిసిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి గందరగోళ పరిస్థితులు నెలకొల్పారన్నారు. వాస్తవానికి తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ నాయకుడు జిల్లా మంత్రి సిఫారసుతో ఈ పదవిని ఇప్పించినట్లు తెలిసిందన్నారు. ఇటువంటి చర్యలు పార్టీ ఐక్యతను దెబ్బతీస్తాయని, కేవలం ఎమ్మెల్యే షాజహాన్ బాషాపై కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఇటువంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు.

గుడ్డ కాల్చి ఇతరులపై వేసే విధానాలని మానుకోవాలని ఆయన హితవు పలికారు.

అనంతరం టిడిపి సీనియర్ నాయకులు రాటకొండ మధుబాబు,సూదిళ్ల సుధాకర్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని,సీఎం చంద్రబాబు నాయుడు సూచనలను పాటిస్తూ పార్టీ కార్యకర్తలు,నాయకుల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సమంజసం కాదన్నారు. కరుడుగట్టిన వైసీపీ నాయకుడికి అధికారిక పదవి కట్టపెట్టడంపై ఆర్.జె.వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. తాము కరుడుగట్టిన తెలుగుదేశం వాదులమని, నామినేటెడ్ పదవులు అధికారిక పదవులను ఇతర వ్యక్తులకు కేటాయిస్తే సహించేది లేదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పూర్తి స్పష్టతతో ఉన్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారు ఎవరో,పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న వారు ఎవరో ఆయనకు తెలుసన్నారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే షాజహాన్ బాషా అసత్య ప్రచారాలు మాని నియోజకవర్గంలో అభివృద్ధికి సహకరించాలన్నారు. లేని యెడల తాము సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబులు దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నవీన్ చౌదరి, మాజీ సర్పంచ్ రాజన్న, గండికోట గణేష్ బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు రకాల రేషన్ కార్డుల సేవలను వినియోగించుకోండి

- సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 08: ఆంధ్ర నాడు,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము సచివాలయం ద్వారా పౌర సరఫరాల శాఖకు సంబందించి 07 రకాల రేషన్ కార్డుల సేవలను ఈ నెలా 7 వ తేదీ నుండి ప్రవేశ పెట్టడం జరిగినదని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రేషన్ సేవలలో భాగంగా. కొత్త కార్డులు కోసం బియ్యం కార్డులో సభ్యుల చేర్చుటకు బియ్యం కార్డు నుండి సభ్యుల విభజన కొరకు బియ్యం కార్డులో సభ్యుల పేర్లు తొలగింపునకు. కార్డుల సరెండరు. బియ్యం కార్డులో చిరునామా మార్పునకు. తప్పుడుగా నమోదు అయినా ఆధార్ సీడింగ్ దిద్దుబాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికి ఏ రేషన్ కార్డులోను నమోదు కాని అర్హత కలిగిన పేదవారు కొత్త రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఉత్తర్వులు జారీ చేసి యున్న వారు,ఇది వరకు కార్డు కలిగి వున్నవారు కూడా కార్డు నందు పై తెలిపిన సవరణ లను గ్రామ వార్డు సచివాలయం నందు చేసుకొనువచ్చునని తెలిపారు. అలాగే జిల్లాలో 7,707.484 మెట్రిక్ టన్నులు కేటాయించగా మే, 2025 మాసమునకు గాను 8642.431 మెట్రిక్ టన్నులు కేటాయించ డమైందని, ఏ రేషన్ షాపునందైన బియ్యము ఇంకాను అవసరమైన యెడల సంబందిత తహశీల్దార్లు స్పష్టమైన నివేదిక పంపిన యెడల అదనపు బియ్యం అలాట్–మెంటు కేటాయించ బడునని, కార్డుదారులందరూ తమకు రావాల్సిన బియ్యమును సంబందిత ఎండియూ వాహన ఆపరేటర్/రేషన్ షాపు ద్వారా పొందవలసినదిగా జిల్లా సంయుక్త కలెక్టర్ వారు ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజాశ్రేయస్సుకు పరితపించిన నాయకుడు పాలకొండరాయుడు

- టిడిపి యువ నాయకుడు జునైద్ అక్బరీ

మదనపల్లి –ఆంధ్రనాడు, మే 08:

ప్రజాశ్రేయస్సుకై పరితపించిన నాయకుడు పాలకొండరాయుడని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు, టిడిపి యువ నాయకుడు జునైద్ అక్బరీ కితాబునిచ్చారు. రాయచోటి పట్టణం మాజీ శాసనసభ్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగువాసి పాలకొండ రాయుడు స్వర్గస్తులైనారు. మదనపల్లి శాసనసభ్యులు ఆదేశాల మేరకు వారి పార్థివదేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించిన తెలుగుదేశం యువ నాయకులు జునైద్ అక్బరి, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఇందులో భాగంగా జునైద్ అక్బరి సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్ బాబులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఘనంగా వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి నూతన గృహప్రవేశం వేడుక

- హాజరైన ఎస్.నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పా రెడ్డి

మదనపల్లి –ఆంధ్రనాడు, మే 08: రామసముద్రం మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణారెడ్డి నూతన గృహప్రవేశ పూజా కార్యక్రమం మాలేనత్తం పంచాయతీ, కొండూరులో గురువారం ఘనంగా జరిగింది. కృష్ణారెడ్డి ఆత్మీయ ఆహ్వానం మేరకు మదనపల్లె వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి హాజరయ్యారు. పెద్దసంఖ్యలో హజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పేరు, పేరునా నిస్సార్ అహమ్మద్ పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలతో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో నెలకొన్న అభిప్రాయం ఏమిటో అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల తీరు,కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరు ఎలా వుందో ప్రజలు ఏమనుకుంటున్నారో నాయకులు నిస్సార్ అహమ్మదుకు తెలిపారు.అనంతరం అందరికీ మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామచంద్రా రెడ్డి, తోపాటు మండల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అందరికీ తలసేమియా చికిత్స అవసరం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్

తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 8 : ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా తిరుపతి రుయా హాస్పిటల్ పీడియాట్రిక్స్ డిపార్ట్మెంట్ డిఈఐసి నందు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ తలసీమియా అంటే హీమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం వల్ల వచ్చే వారసత్వ రుగ్మత అని అన్నారు. ఎర్ర రక్త కణాలలో ఆక్సిజన్‌ను తీసుకెళ్ళడానికి సహాయ పడే ఒక ప్రోటీన్ తక్కువగా ఉండడం అని తెలిపారు. రక్తహీనత,అలసట, శరీరం రంగు పాలి పోవడం, ఎదుగుదల, ఆలస్యం, వంటి లక్షణాలు ఉంటాయని అందరికి చికిత్స అవసరం అవుతుందని అన్నారు. కుటుంబం లో ఎవరికైనా తలసేమియా ఉన్నట్లయితే కుటుంబ సభ్యులందరూ తలసేమియ పరీక్షలకు స్క్రీనింగ్ చేసుకోవాలని తెలిపారు. తలసేవియా వ్యాధి గ్రస్తుల చికిత్స కొరకు రక్తం ఉచితంగా ఎక్కించ బడునని అన్నారు. పీడియాట్రిక్స్ డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ డా. మనోహర్ మాట్లాడుతూ తీవ్రమైన సందర్భాలలో రక్తమార్పిడి, మందులు, ఎముక మజ్జ మార్పిడి వంటి చికిత్సలు అవసరం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎముక మజ్జ ఆపరేషన్ కు 63 మంది రిజిస్టర్ అయి ఉన్నారని 11 మందికి ఆపరేషన్ పూర్తి అయిందని ఇద్దరు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎన్సిడిసిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ ప్రదీప్ ల్యాబ్ టెక్నీషియన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన రేణిగుంట యువ నాయకుడు



రేణిగుంట - ఆంధ్రనాడు, మే 8: రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను రేణిగుంటకు చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నిత్యాసాగర్ కలిసి సత్కరించారు. జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రేణిగుంటకు చేరుకుని సత్యవేడు శ్రీ సిటీలో ఎల్జి కంపెనీ భూమి పూజ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలో విద్యాసాగర్ రాష్ట్ర మంత్రిని కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

విమానాశ్రయంలో సీపీఎం ప్రధాన కార్యదర్శికి స్వాగతం

రేణిగుంట - ఆంధ్రనాడు, మే 8: సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కి రేణిగుంట విమానాశ్రయంలో గురువారం సిపిఎం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం ఉదయం న్యూఢిల్లీ నుంచి తిరుపతి చేరుకున్న ఎంఏ బేబీ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. అనంతరం తిరుపతి పట్టణంలో జరిగే బహిరంగ సభ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, సీనియర్ సిపిఎం పార్టీ నాయకుడు కందారపు మురళి, టి. సుబ్రహ్మణ్యం, కేఎన్ఎన్ ప్రసాదరావు, హరినాథ్, ఈశ్వరి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దపంజాణి - ఆంధ్రనాడు, మే 08: మండల పరిషత్ కార్యాలయంలో జరగాల్సిన మండల సర్వసభ సమావేశం కోరం లేకపోవడం కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం కూడా ఎంపీపీ రెడ్డప్ప, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరైనప్పటికీ మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ తెలిపారు.

మంచినీటి నాణ్యత పరిశీలన చేయాలి

❖ డీఈఈ స్టాలిన్

పెద్దపంజాణి - ఆంధ్రనాడు, మే 08: మంచినీటి నాణ్యతను తరచూ పరిశీలించాలని పలమనేరు సబ్ డివిజన్ ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ స్టాలిన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చలమంగళం పంచాయతీ చిన్నేపల్లిలో త్రాగునీటి నమూనా నీటి పరీక్షల నిమిత్తం సేకరంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, అలాగే క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ల్యాబ్ అసిస్టెంట్ కెమిస్ట్ మనికంఠ, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై మేము ఎలా నడవాలి

పెద్దపంజాణి - ఆంధ్రనాడు, మే 08: ఈ రోడ్డుపై మేము ఎలా నడవాలంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పంజాణి సత్రంలో మురుగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడం కారణంగా మసీదు నుండి సుమారు 150 మీటర్ల పొడవునా చిన్న పాటి వర్షానికే మురుగు నీరు, వర్షపునీరు రోడ్డు మీద నిలిచిపోతోందని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డులో సుమారు అడుగులోతుకు పైగా వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీ సిటీలో ఎల్‌జీ భారీ పరిశ్రమకు భూమిపూజ

❖ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్

శ్రీ సిటీ - ఆంధ్రనాడు, మే 08: ఉద్యోగాలు, ఆవిష్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. దక్షణ కొరియాకు చెందిన అంతర్జాతీయస్థాయి ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్.జి. ఎలక్ట్రానిక్స్ శ్రీ సిటీ యూనిట్ కు గురువారం ఉదయం లోకేష్ భూమిపూజ చేశారు. మంత్రికి శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రవీంద్ర సన్నారెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎల్ జి యూనిట్ కు మాత్రమే కాదు - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఇది మన రాష్ట్రంతోపాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. ?5,000 కోట్లకు పైగా పెట్టుబడితో ఎల్.జి. ఎలక్ట్రానిక్స్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయి తయారీ యూనిట్‌ను తీసుకురావడమే గాక ఎపిని పెట్టుబడుల గమ్యస్థానంగా ప్రపంచ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తోంది. మేడ్ ఇన్ ఆంధ్ర నుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా ఎల్ జి శ్రీసిటీ యూనిట్ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబునాయుడు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. మేము సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడమేగాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం. శ్రీసిటీలో ఎల్.జీ ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మీ ముందుకు రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఎల్.జి మరియు దాని విక్రేత కంపెనీల నాయకత్వ బృందాలు, భాగస్వాములందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. కూటమి ప్రభుత్వం కేవలం కర్మాగారాలను నిర్మించడం లేదు, రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఎల్.జీ ఫ్యాక్టరీ అధునాతన గృహోపకరణాలైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు స్మార్ట్, ఇంధన - సమర్థవంతమైన సాంకేతికతతో ఉత్పత్తులను అందిస్తుంది. ఒక స్మార్ట్ ఫ్యాక్టరీ, ఒక స్మార్ట్ రాష్ట్రం, ఒక స్మార్ట్ దేశం యొక్క సరికొత్త ప్రయాణం ఈరోజు ప్రారంభమవుతుంది. ఇది కేవలం తయారీ గురించి కాదు ఇది జీవన భవిష్యత్తును రూపొందించడం గురించి. ఇది ఉద్యోగాలను సృష్టించడం, మన యువతకు సాధికారత కల్పించడం, జీవితాలను మార్చడం గురించి. ఎల్ జి, దాని అనుబంధ కంపెనీల ద్వారా భవిష్యత్తులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన భారీ ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు కలల సాకార క్షణం. సప్లయ్ చైన్‌ను మరింత బలోపేతం చేయడమేగాక దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే హైటెక్ యూనిట్ అని ఆయన పేర్కొన్నారు.

పారిశ్రామిక పురోగతికి చుక్కానిలా శ్రీసిటీ : శ్రీ సిటీ పారిశ్రామిక పురోగతికి ఒక చుక్కానిలా మారింది. ఇలాంటి ప్రాజెక్టులతో మేము ఎపి భవిష్యత్తును నిర్మిస్తున్నాం, స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తున్నాం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని లోకేష్ అన్నారు. శ్రీసిటీ ఎల్ జి ప్లాంట్ ప్రారంభమైతే, దేశానికి అవసరం అయ్యే 70 శాతం ఏసీలు ఇక్కడ నుంచే సరఫరా అవుతాయి. ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఎపిని మార్చాలనే మా ఆశయాన్ని ఎల్‌జి సంస్థ ముందుకు తీసుకెళ్తోంది. భూసేకరణ, నిర్మాణం నుండి పూర్తి స్థాయి ఉత్పత్తి వరకు - ఈ ప్రాజెక్టు ప్రతి దశలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున తమ నిరంతర మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి, అధునాతన ఆవిష్కరణలకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడానికి మేం కట్టుబడి ఉన్నామన్నారు. రాబోయే నాలుగేళ్లలో శ్రీసిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామని లోకేష్ పేర్కొన్నారు. భారత్ లోని రిపబ్లిక్ కొరియా రాయబారి లీ సియాంగ్ హూ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో ఆంధ్రప్రదేశ్లో తమ దేశానికి చెందిన కియా కంపెనీ ఏర్పాటైంది, ఇప్పుడు ఎల్జి వస్తోంది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందిస్తున్న చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదం ఎదురైతే అప్రమత్తంగా ఉండాలి

❖ ఐఓసీఎల్‌లో భద్రతా ప్రమాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పీలు

యాదమరి - ఆంధ్రనాడు, మే 08: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలలో భద్రతా ప్రమాణాల పై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో గురువారం యాదమరిలో గల ఐఓసిఎల్ లో భద్రతా ప్రమాణాల పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి మాక్ డ్రిల్ నిర్వహించి అనంతరం చీఫ్ టెర్మినల్ అరుణ్ ప్రసాద్ తో సమావేశమై భద్రతా చర్యలు, ఇన్నైడ్ యాక్సిస్ లిమిటేషన్ లు, బయటి వ్యక్తుల అనుమతి నియంత్రణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధి పై సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఓసిఎల్ టెర్మినల్ వద్ద పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు. ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాల పై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పైప్ లైన్ సెక్యూరిటీ, నిర్వహణ, ఇంధనం స్టోరేజ్ ట్యాంక్‌ల వద్ద భద్రత, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకుంటున్న చర్యల పై సమీక్షించి ముందస్తు జాగ్రతా చర్యలను తీసుకోవాలన్నారు. వాహనాల ప్రవేశ, నిర్గమ ద్వారాలను పరిశీలించాలని, కట్టుదిట్టమైన భద్రత ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవల పై సమీక్షించి ఆదునిక సౌకర్యాల తో కూడిన అంబులెన్స్ ను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐఓసిఎల్ వద్ద నైట్ డ్యూటీ లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఇతర ప్రాంతాల నుండి ఇంధనం నింపుకోవడానికి వచ్చే లారీ లను పూర్తి స్థాయిలో తనిఖీ చేసే సమయంలో వాహనాల స్థితిని పరిశీలించి పంపాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగినట్లైతే పూర్తి అప్రమత్తంగా ఉంటూ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ మాక్ డ్రిల్ సమయంలో ఐఓసిఎల్ లో ఉన్న స్టోరేజ్ పాయింట్ లాలలో ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొనేందుకు ఎలా స్పందించాలో తెలిపారు. ఐఓసిఎల్ వంటి ఇంధన సంస్థలు ఉగ్రదాడులకు ప్రధాన లక్ష్యాలుగా మారే అవకాశాలు ఉండడంతో భద్రతా ఏర్పాట్ల పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. భద్రతకు సంబంధించి మానవ వనరుల వివరాలు, వాటి విధులు అప్రమత్తతా స్థాయిలను అధ్యయనం చేశారు. పారిశ్రామిక సంస్థలు తమంతట అవే భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కలిసి పని చేస్తుందని హామీ ఇచ్చారు. ఐఓసిఎల్ టెర్మినల్ చీఫ్ వివరిస్తూ చెన్నై నుండి అండర్ గ్రౌండ్ పైప్ లైన్ ద్వారా ఇంధనం సరఫరా జరుగుతుందని, 2013 నుండి టెర్మినల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, రాత్రి సమయంలో టెర్మినల్ కార్యకలాపాలు ఉండవని జిల్లా కలెక్టర్, ఎస్పీ కి వివరించారు. మాక్ డ్రిల్ లో ఐ ఓ సి ఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, అడిషనల్ ఎస్ పి రాజశేఖర్ రాజు, తహశీల్దార్ పార్థసారథి, ఇతర సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

చౌడేపల్లి - ఆంధ్రనాడు, మే 08: రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని, దుర్గసముద్రం రైతు సేవా కేంద్రలో మండల వ్యవసాయ అధికారి జ్యోతమ్మ,మాస్టర్ ట్రైనర్ నవీన్ తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు-డిజిటల్ ట్రైనింగ్ పై రైతులకు శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వలన కలిగే లాభాలు, వాటి నష్టాలను తెలియజేశారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్లను వ్యవసాయ, అగ్రిసెంట్రల్, ప్లాంటిక్స్, ఎన్పీఎస్ఎస్, మార్కెటింగ్ యాప్, యుట్యూబ్ వంటి వ్యవసాయ యాప్ల వినియోగం ద్వారా వ్యవసాయం చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.అందులో ఉన్నవారు 10 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లయితే వారికి టాప్ త్రీ లోని ముగ్గురికి శిక్షక రైతులకు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు,మూడవ బహుమతి గా రూ.8 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించి, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా మండల వ్యవసాయశాఖ అధికారి జ్యోతమ్మ పాల్గొన్నారు, రైతులు పాల్గొన్నారు.

నాటు బాంబు కాదు డిటోనేటర్

యాదమరి - ఆంధ్రనాడు, మే 8: కొత్తూరు ఆది ఆంధ్ర వాడకు చెందిన లోహిత్ (7) బుధవారం సాయంత్రం డిటోనేటర్ పేలుడికి తీవ్రంగా గాయపడ్డాడు. నాటు బాంబు పేలి గాయాలైనట్లు వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాంబ్స్క్వాడ్ బృందం గురువారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి సిబ్బందితో పరిశీలించారు. కాగా సంఘటనా స్థలంలో డిటోనేటర్లు లభ్యమయ్యాయి . బాంబ్ స్క్వాడ్ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకుని జిల్లా ఎస్పీ గారికి సమాచారం అందించారు. బాధితుడి తల్లి సౌజన్య స్టేట్మెంట్ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం

❖ యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్

బి.కొత్తకోట – ఆంధ్రనాడు, మే 08 : ఈ నెల 11 వ తేదీ (ఆదివారం) వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం, టి.సదుం బస్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించబడునున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించబడునున్నారు. ముఖ్యంగా ఈసీజీ, ఎకో, ముందస్తుగా క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బోయకొండ గంగమ్మకు హుండీ ఆదాయం రూ 63.89 లక్షలు

చౌడేపల్లి – ఆంధ్రనాడు, మే 08: బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ 63,89,617 ఆలయం సమకూరినట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలియజేశారు. ఆలయంలో గురువారం 42 రోజులకు గాను లెక్కింపు నిర్వహించగా, నగదుతో పాటు 39.250 గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు అమ్మవారికి కానుకలుగా సమర్పించారన్నారు. అదేవిధంగా రణభేరి గంగమ్మ దేవస్థానం నుండి ఆదాయం రూ 40,463 లు ఆదాయంగా సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శశికుమార్, చౌడేపల్లి పోలీసు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, దేవస్థానం అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడి మృతి

❖ నివాళులర్పించిన ఎంఈఓలు, తోటి ఉపాధ్యాయులు

బి.కొత్తకోట – ఆంధ్రనాడు, మే 08: అనారోగ్యంతో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. మండలం లోని గుడిపల్లి ఎంపిపిఎస్ పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కే.ముని పద్మనాభం నెల రోజుల క్రిందట అనారోగ్యం బారినపడి ఆసుపత్రిలో చికిత్స చేయించు కున్నారు.ఇటీవల ఇంటికి వచ్చారు. అయితే గురువారం ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముని పద్మనాభయ్య మృతి పట్ల ఎంఈఓలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ముని పద్మనాభయ్య ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని, ఆయన మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు.

పిడుగు పడి మహిళ మృతి

పెద్దపంజాణి – ఆంధ్రనాడు, మే 08: మండలంలోని నెర్నిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం పిడుగు పడి అర్చన అనే మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగభూషణ భార్య అర్చన పొలములో పశువుల మేత కోస్తుండగా వర్షం రావడంతో సమీపంలో ఉన్న చెట్టు కిందకు వెళ్లింది. ఈ నేపథ్యంలో పిడుగుపడి పడడంతో అర్చన అక్కడిక్కడే మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించండి

❖ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు వినతి

కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 8: మండలం లోని ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) అభివృద్ధికి తోడ్పాటును అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ అవసరం సురేష్ రెడ్డి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ కు మౌలిక వసతులతో పాటు, విశాలమైన ల్యాబ్, విద్యార్థినులకు ఆరవ తరగతి నుంచే హాస్టల్ వసతి కల్పించాలని విన్నవించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థుల శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంత అవసరమని పాఠశాలలో ఆట స్థలాన్ని పూర్తిస్థాయిలో తయారు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటును అందించాలని కోరినట్లు తెలిపారు. మరి ముఖ్యంగా కేవీబీపురం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పునర్ ప్రారంభం చేసి ఎస్సీ విద్యార్థుల ఎదుగుదలకు చేయూతను అందించాలని మంత్రి నారా లోకేష్ కు వినతి పత్రాన్ని అందించినట్లు సురేష్ రెడ్డి తెలిపారు. సంబంధిత విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

బుడిగి పెంట గ్రామాన్ని సందర్శించిన డబ్ల్యూహెచ్‌వో డాక్టర్ మౌనిక

యాదమరి – ఆంధ్రనాడు, మే 8: బుడిగి పెంట గ్రామాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్ మౌనిక గురువారం సందర్శించారు. రెండు నెలల క్రితం గ్రామంలో విజయ్ దీప్ అనే 14 సంవత్సరాల బాలుడికి పలురకాల రుగ్మతలు రావడంతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం సంబంధిత బాలుడికి సంబంధించిన నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డబ్ల్యుహెచ్వో కు పంపడంతో ఆ బాలుని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించే నిమిత్తం డాక్టర్ మౌనిక గురువారం యాదమరి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి నివేదికలను పరిశీలించిన అనంతరం గ్రామంలో జయదీప్ కు కాన్పు సమయంలో అందించిన వ్యాధినిరోధక టీకాల వివరాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రెండు సంవత్సరాల లోపు చిన్నారులకు ఇచ్చిన వ్యాక్సినేషన్ కు సంబంధించిన వివరాలను కూడా ప్రతి గృహానికి వెళ్లి సేకరించారు. జయదేవ్ కి ఎలాంటి సమస్య లేదని అది చిన్న సైడ్ ఎఫెక్ట్ వల్ల అతను కొంత కాలం శారీరక రుగ్మతలతో ఇబ్బంది పడ్డాడు తప్ప ఇంకెలాంటి సమస్య లేదని డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ మౌనిక నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లకు అవగాహన

రేణిగుంట – ఆంధ్రనాడు, మే 08: రేణిగుంట పట్టణ ఆటో డ్రైవర్లకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర గురువారం ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట అర్బన్ సీఐ గా జయచంద్ర విధులు చేపట్టిన నాటినుండి రేణిగుంట పట్టణం పై ప్రత్యేక శ్రద్ధ ఉంచి సమస్యల పరిష్కార దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఐ దృష్టికి పట్టణంలో విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న విషయాన్ని స్థానికులు సిఐ కి ఫిర్యాదు చేయడం జరిగింది. అందులో భాగంగా ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, పోలీసులకు దిశా నిర్దేశం చేస్తూ పట్టణ పురవీధుల్లో ఎక్కడ కూడా విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేయకుండా క్రమబద్ధీకరిస్తూ పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా పట్టణంలోని బస్టాండ్ కూడలి, పోస్ట్ ఆఫీస్ వీధి, ఫ్లైఓవర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ కూడలిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కనుగొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మం తప్పని ధీరులు పాండవులు

ముగిసిన విరాటపర్వం ప్రవచన కార్యక్రమం

తిరుపతి–ఆంధ్రనాడు, మే 8: పాండవులు తమ ధర్మం పట్ల నిబద్ధతను చూపిస్తూ, ఇతరులకు సహాయం చేస్తూ, సత్యం మరియు ధర్మాన్ని పాటించారని సరస్వతీ పుత్రులు, పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. మేడసాని మోహన్ చే అకాడమీ ఆఫ్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో వరుణ కటాక్షం కోసం విరాప పర్వం పై మూడు రోజుల అపూర్వ ప్రసంగ వైభవం కార్యక్రమం గురువారం అన్నమాచార్య కళామందిరంలో ముగిసింది. ఈ సందర్భంగా మేడసాని మోహన్ మాట్లాడుతూ మహాభారతం సమాజానికి మార్గదర్శిగా పనిచేస్తుందని, నైతిక విలువలను తెలియజేస్తుందని కొనియాడారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య రాళ్లపల్లి రామమూర్తి మాట్లాడుతూ విరాటపర్వం ప్రవచన కార్యక్రమం ద్వారా వరుణ కటాక్షం కలిగిందని కొనియాడారు. ప్రత్యేక అతిథులు భారతీయ విద్యాభవన్ సంచాలకులు సత్యనారాయణ రాజు, ప్రవచనకర్త విభీషణ శర్మ మాట్లాడుతూ ప్రవచన కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తున్న డాక్టర్ మేడసాని మోహన్ తిరుపతి వాసి కావడం శుభపరిణామన్నారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి సురేంద్ర నాయుడు మాట్లాడుతూ విరాటపర్వం ప్రవచన కార్యక్రమానికి సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ్యాక్రమంలో డాక్టర్ ద్వారం లక్ష్మి, ఆచార్య దేవసేన నాయుడు, జిఎల్ మనోహర్, ఏపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

11 టన్నుల రేషన్‌బియ్యం స్వాధీనం

యాదమరి – ఆంధ్ర నాడు, మే 8: మండల పరిధిలోని పుల్లయ్య గారి పల్లి గ్రామంలో ఓ గోడౌన్ లో నిల్వ ఉంచిన సుమారు 11 టన్నుల పిడిఎఫ్ రైస్ ని యాదమరి తహసిల్దార్ పార్థసారథి గురువారం సీజ్ చేశారు. గంగవరానికి చెందిన చెంగల్రాయులు వివిధ ప్రాంతాల నుంచి పిడిఎఫ్ రైస్ ను సేకరించి కర్ణాటకలోని బంగారు పేటకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇతనితో పాటు గంటా ఊరికి చెందిన రోషన్, కర్ణాటక రాష్ట్రం మొడికుడి కి చెందిన ప్రదీప్ లను యాదమరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలంచారు. నిందితుల వద్ద నుంచి ఒక కారుని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చిత్తూరు ఎఫ్‌సీఐ గోడౌన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ ప్రసాద్, విఆర్ఓ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

నాగలాపురం – ఆంధ్రనాడు, మే 08: ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానంలో తిరుపతి తనిఖీ అధికారి శ్రీ పనిరాజ సేన దేవాదాయ శాఖ, ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సమక్షంలో కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్రారెడ్డి సారిధ్యములో గురువారం హుండీ లెక్కింపు 42 రోజులకు ఆదాయము రు 2,68,560, (రెండు లక్షల, అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై రూపాయలు) ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన జన సైనికులు

బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 08: బైరెడ్డిపల్లి మండలానికి నూతన తహసీల్దార్ గా ప్రసన్న కుమార్ బాధ్యత లు చేపట్టడం జరిగింది. ఇతను గతంలో సుమారు 6 సంవత్సరాలు అదే కార్యాలయంలో రేవెన్యూ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. మండలం పై మంచి పట్టు ఉన్నదని మళ్ళీ ప్రజలకు సేవలు అందివ్వడానికి ఇతనికి ఓ అవకాశం వచ్చింది. ఇతని రాకను స్వాగతిస్తూ బైరెడ్డిపల్లి మండల జన సైనికులు మర్యాద పూర్వకంగా కలిసి ధూష్యాలవ కప్పి, పూల మాల వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలోనాగేష్ కుమార్ రాజా, మధు సుదన్, కళ్యాణ్, ప్రసాద్ బాలకృష్ణ, మేఘనాథ్ రెడ్డి, హరి, చరణ్ పాల్గొన్నారు.

దొరస్వామికి డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి



పులిచెర్ల – ఆంధ్రనాడు, మే 8: పులిచెర్ల తాసిల్దార్ కార్యాలయం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ దొరస్వామికి డిప్యూటీ తాసిల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తాసిల్దారుగా పదోన్నతి పొందిన దొర స్వామిని చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్‌గా నియమించారు. డిప్యూటీ తాసిల్దార్‌గా పదోన్నతి పొందిన దొరస్వామిని పులిచెర్ల మండలం తాసిల్దార్ జయసింహ, డిప్యూటీ తాసిల్దార్ దిలీప్, సర్వేయర్. మార్కండేయులు, రెవిన్యూ సిబ్బంది వీఆర్వోలు, వీఆర్ఏలు, ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

చౌడేపల్లి – ఆంధ్రనాడు, మే 08: స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగల నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పరమశివుడు పార్వతి దేవిల కళ్యాణం జరిగింది. అనంతరం ఏనుగు వాహనంపై శివపార్వతులు ఊరేగారు. కల్యాణోత్సవానికి సిహెచ్ బసప్ప కుమారులు శ్రీధర్, ఏనుగు వాహనానికి మజర రెడ్లు ఉభయదారులుగా వ్యవహరించారు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

చౌడేపల్లి – ఆంధ్రనాడు, మే 8: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నాగేశ్వరరావు కథనం మేరకు....చౌడేపల్లి మండలం ఏ కొత్తకోట పంచాయతీ అగ్రహారం కు చెందిన లోకేష్ 26 అప్పులు చేసి మనోవేలతో క్షణికావేశంలో గ్రామానికి సమీపంలోని తన టమోటా తోట వద్ద గల చింత చెట్టుకు ఉరేసుకుని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచనామా నిమిత్తం తరలించి. మృతుడి తల్లి హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, మే 8: 44 వ డివిజన్ మధురానగర్ లో 36.65 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం ప్రారంభించారు. ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన కార్పోరేటర్ వరికుంట్ల నారాయణ ఆధ్వర్యంలో కార్పోరేటర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజాకార్యక్రమం తరువాత శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆరణి ఆవిష్కరించి రోడ్డును ప్రారంభించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలోని రోడ్ల ప్యాచ్ వర్కలను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపా రు. గత పాలకుల తీరుతో మున్సిపల్ కార్పోరేషన్ ను అప్పుల కుప్పగా మారిందని ఆయన ఆరోపించారు. తిరుపతిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు ఐటి శాఖ మంత్రి లోకేష్‌లు కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. కాగా నర్శరీరోడ్డు ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థాని కులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ ఎస్ ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గోమతి, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, కార్పోరేటర్లు దూది కుమారి, సికే రేవతి, ఆదం సుధాకర్ రెడ్డి, దూది శివ, యాదవకృష్ణ, రాజా రెడ్డి, సుధాకర్, సాయిదేవ్ యాదవ్, బాజ్జీ, రాజేష్ ఆచ్చారి, ఆళ్వార్ మురళీ, ఆముదాల వెంకటేష్, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, కొండా రాజ్ మోహన్, రమేష్, సుధీర్, మునస్వామి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 పరీక్షకు 608 మంది హాజరు

తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, మే 8: తిరుపతి జిల్లాలో గురువారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 608 (66.74%) మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని, 911 అభ్యర్థులకు గాను 608 అభ్యర్థులు హాజరయ్యారని వెరసి మొత్తం 66.74% హాజరయ్యారని, 303 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు.

దుకాణాలు రోడ్లపై పెట్టకుండా చర్యలు చేపట్టండి

❖ కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, మే 8: తాతయ్య గుంట గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై దుకాణాలు పెట్టకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. జాతర నేపథ్యంలో ఆలయంలో భక్తులకు కల్పించిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలసి కమిషనర్ గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆలయానికి భక్తులు వచ్చి, వెళ్ళే మార్గాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడా లని అన్నారు. ముఖ్యంగా ఆలయ పరిసరా ల్లో రోడ్లపై దుకాణాలు పెట్టడంతో ఇబ్బందు లు వస్తున్నాయని, అలా రోడ్లపైకి రాకుండా లైన్లు వేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను, ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో భక్తులు ఎక్కువగా వస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నా మని అన్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఇందులో 24 గంటలు అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. త్రాగునీరు అందుబాటులో ఉంచామని, మరుగు దొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టాలని అన్నారు. భక్తులు ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనానికి వచ్చి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వృద్ధులు, పిల్లలు, వికలాంగులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, తులసి కుమార్, ఆలయ ఈవో జయకుమార్, డీసీపీ మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి. ఈ.లు శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ

కుప్పం- ఆంధ్రనాడు, మే 8: ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని శీగలపల్లి సమీపంలో గల కృష్ణమూర్తి పొలంలో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతుల నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో 49 మంది మహిళలు శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులకు బీజామృతం, ద్రవ జీవామృతం, ఘనజీవామృతం, విత్తన గుళికలు, చేయడం కషాయాలు తయారుచేసి చూపించడం జరిగింది. శాంతిపురం మండలంలో ముల్లూరు కృష్ణాపురంలో రైతు శివారెడ్డి వాళ్ల పొలంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమం షేక్ బచ్చిబాబు. అమృతవల్లి, మీరబీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

❖ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, మే 8: స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ భవానీనగర్ సర్కిల్ లోని ఓ ప్రైవేట్ స్కూల్ లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం ప్రారంభించారు. 16ఎంఎన్ సి కంపెనీలు ఏడు వందల ఉద్యోగాలు కోసం జాబ్ మేళాలో ఇంటర్వూ లు నిర్వహించి సెలక్ట్ అయిన యువతకు సాయంత్రం ఆఫర్ లెటర్స్ అందించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామి ఇచ్చారని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజక వర్గంలో మెగా జాబ్ మేళాలను స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. తిరుపతిలో ఇప్పటి వరకు 14 మినీ జాబ్ మేళాలు నిర్వహించి 615 మందికి ఉద్యోగాలను స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ కల్పించిందని ఆయన తెలిపారు. తిరుపతిని విశాఖపట్నం, విజయవాడలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు కట్టుబడి ఉన్నారని ఆయన చెప్పారు. యువత మెగా జాబ్ మేళాలో ఉద్యోగం లభించకపోతే నిరాశ చెందకుండా తిరిగి ప్రయత్నించాలని ఆయన కోరారు. అలాగే స్థోమతను బట్టి వ్యాపారం ప్రారంభించి కొనసాగిస్తే ఉద్యోగులకన్నా అధికమొత్తం పొందవచ్చని ఆయన సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత జ్ఞానాన్ని పెంచుకుని కష్టపడితే విజయం ఖాయంగా లభిస్తుందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోగా కొత్త కంపెనీలను పెట్టించకపోగా ఉన్నవాటిని ఇతర రాష్ట్రాలకు వెళ్ళగొట్టారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ జిల్లా అధికారి లోకనాథం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, గీతం స్కూల్స్ యజమాని తమ్మినేని వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు రాజా రెడ్డి, దేవర మనోహర్, ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

కూటమి పార్టీల కూసాలు కదిలిద్దాం

❖ పాకాల వైసీపీ నేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపు
❖ మర్యాద పూర్వకంగా మోహిత్ రెడ్డి కలిసిన నేతలు
❖ పార్టీ పదవులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపిన నేతలు

తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, మే 8: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పార్టీ కార్యాలయం వద్ద చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండల నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో కీలక పదవులు ఇప్పించి, తగిన గుర్తింపు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎంతో ఆప్యాయంగా పలుకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశమైన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎన్నికల్లో గెలుపు, ఓటమి దైవ నిర్ణయమని. ప్రజలకు తోడుగా నిలబడితే భవిష్యత్తులో మనందరికీ మంచి జరుగుతుందన్నారు.

ప్రతిపక్షంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కష్టపడుదామని. కలసి కట్టుగా పోరాడి కూటమి పార్టీల కూసాలు కదిలించాలని పిలుపు ఇచ్చారు. ప్రజలకు తోడుగా నిలబడితే భవిష్యత్తులో మంచి జరుగుతుందని పార్టీ నేతలకు తెలియజేశారు. జగనన్నను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని నేతలు అందరికి విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో కలసి కట్టుగా పనిచేస్తే అద్భుత విజయాలను సొంతం చేసుకోవచ్చు గత ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేశారు. ప్రజలు మార్పు కోరుకున్నారు. అధికారం పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేంత వరకు మనం ప్రజల తరపున పోరాటం చేయాలి. ఇప్పుడు మనకు పోరాడే సమయం వచ్చింది. కలసికట్టుగా పనిచేద్దాం. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుందాం. మన పార్టీలో నాయకుల మధ్యన ఏదైనా చిన్న, చిన్న విభేదాలు వుంటే పరిష్కరించుకుందామని సూచించారు. ఒక కుటుంబంలో వున్న నలుగురు మధ్యన విభేదాలు వస్తుంటే ఇంత పెద్ద పార్టీలో విభేదాలు రావడం సహజమే అయినా ఆ కుటుంబంలో ఎవ్వరికి ఆపద వచ్చినా అందరూ ఒక్కటై పోరాడుతారు. అలాగే మన పార్టీ కూడా ఒక కుటుంబం వంటిది. చిన్న పాటి విభేదాలను పక్కనపెట్టి పోరాటానికి ఐక్యతతో కలసి రావాలని అభ్యర్థించారు. ప్రతి పక్షం మన పార్టీకి కొత్త ఏమీ కాదని, పోరా టాలతో పుట్టిన పార్టీ పోరాడటంలో జగనన్నను మించిన లీడర్ ఎవ్వరు లేరన్న విషయం గుర్తుంచుకుని పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.. మీలో ఒక్కనిగా.. మీ కుటుంబం సభ్యునిగా ఎవ్వరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని, ఎప్పుడూ పార్టీ కార్యక్రమాలే కాదు, వ్యక్తిగతంగా ఏ కార్యక్రమానికి పిలిచినా వస్తానని, మనమందరం కలసి మెలసి పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టాలని విన్నవించారు.

తప్పు చేసిన పోలీసులను ప్రశ్నించాలి: మండలంలో ఏ ఒక్క నాయకుడుని అయినా పోలీసులు బెదిరించి తప్పుడు కేసు పెడితే ప్రతి ఒక్కరు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వారిని ప్రశ్నించాలి, అతనిని బయటకు తీసుకు వచ్చేంత వరకు పోరాడితే పోలీసులు కూడా చట్టాన్ని అతిక్రమించి అడ్డదిడ్డంగా పనిచేసే అవకాశం ఉండదు అన్న నిజం తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడ తప్పు చేసినా నిలదీస్తే మరోసారి ఆ తప్పు జరగకుండా భాధ్యతతో పనిచేస్తారని, ఆ పోరాటంలో మీతో పాటు తాను కూడా వస్తానన్నారు. పోరాడితే పోయేది ఏమీ లేదు. మహా అయితే ప్రజలకు మేలు జరుగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచు కోవాలన్నారు. అధికారం చేతిలో వున్నప్పుడు అందరూ మన దగ్గరకు వస్తారు. ప్రతిపక్షంలో మనకు దగ్గరగా వున్నవారి చేయిని ఎట్టి పరిస్థితుల్లో వదలనని మాట ఇచ్చారు. చివరగా పార్టీ పదవులు పొందిన వారంతా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నయా ఫ్యాసిజాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం

❖ సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి

తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, మే 8: ఎనభై ఏళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలా డించిన ఫాసిజాన్ని ప్రాణాలకు సైతం తెగించి ఎర్రసైన్యం ఎదుర్కొందని, ప్రస్తుతం విజృంభిస్తున్న నయా ఫాసిజాన్ని విశాల ఐక్యవేదికగా ప్రజలందరినీ కలుపుకుని ఎదుర్కొందాం అని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపు నిచ్చారు. సిపిఎం రాష్ట్రకమిటీ సమావేశాలు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా 8-10 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫాసిజంపై ప్రజా సైన్యం విజయ స్ఫూర్తి'తో బహిరంగసభ తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో గురు వారం సాయంత్రం జరిగింది. తొలుత ఆర్టీసి సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి వందలాది మంది కార్యకర్తలతో దాదాపు కిలోమీటర్ పొడవున భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అగ్రభాగాన మార్క్సిస్టు మహనీయుల చిత్రపటాలతో ప్రదర్శనగా నిలిచారు. అనంతరం కచ్చపి ఆడిటోరియంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరా జు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. 'ఫాసిజంపై ప్రజాసైన్యం విజయ స్ఫూర్తి'కి చిహ్నంగా తొలుత నేతలు అభివాదం చేశారు. గతంలో హిట్లర్, ముస్సోలిని వంటి కొంతమంది ఫాసిజంతో ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తే రష్యాలో స్టాలిన్ సారథ్యంలో వారిని ఎదుర్కొని ఫాసిజాన్ని కూకటివేళ్లతో నిర్మూలించారని గుర్తు చేశారు. ఫాసిజంపై ఎర్రజెండా మాత్రమే పోరాడిందన్నారు. 2 కోట్ల 60 లక్షల మంది ఎర్రసైన్యం ప్రాణాలను అర్పించి దుష్టపాలన ను అంతమొందించిందన్నారు. పెహల్గామ్ ఘటన సందర్భంగా ఒక వర్గాన్ని వ్యతిరేకి స్తూ దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టడం సరైనది కాదన్నారు. ఏప్రిల్ 22న పెహల్గామ్ ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పవడం బాధాకరమని, దీన్ని తాము ఖండిస్తున్నామ న్నారు. ఉగ్రవాదంపై కేంద్రం సాగిస్తున్న దాడికి గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ప్రదాని అధ్యక్షతన జరిగిందని, దీనికి సిపిఎం నుంచి జాన్ బిట్రస్ హాజర య్యారని, ప్రజలకు నష్టం జరగకుండా ఉగ్రవాదాన్ని నాశనం చేయాలని, అందుకు తమ మద్దతు ఉంటుందని వెల్లడించామని తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని, అన్ని మతాల్లోనూ ఉగ్రవాదం ఉంటుంద న్నారు. ఉగ్రవాదుల దాడుల్లో కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన ఆర్తీ అనే అమ్మాయి, ఆ బాధల్లో కూడా తనను కాపాడి, తనకు దైర్యం చెప్పిన ఇద్దరు ముస్లీం సోదరులనుద్దేశించి కాశ్మీర్ తనకు ఇద్దరు మిత్రులను ఇచ్చిందని ప్రకటించడం భారతీయ లౌకికవాదానికి నిదర్శనమన్నారు.

సిపిఎం 24 వ మహాసభ దేశ సమైక్యత కోసం, ప్రజల హక్కుల కోసం పోరాడాలని తీర్మానించిందని, దేశ ప్రజలందర్ని కుల, మతాలకు అతీతంగా ఒకతాటిపై నిలబెట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాపై ఉందన్నారు. పోలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ ఫాసిజం తొలుత కమ్యూనిస్టులను నాశనం చేయాలనుకుంటుందని, హిట్లరు పార్లమెంట్‌ను తగలబెట్టి ఆ నెపాన్ని కమ్యూనిస్టులపై రుద్ది వారిని జైలు పాలు చేశారని, అయినా బెదరకుండా పాసిజంకు వ్యతిరేకంగా ఎర్రసైన్యం ప్రాణాలొడ్డి ఎదుర్కొందన్నారు. వారి త్యాగఫలితమే ప్రపంచ శాంతి అని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ఇదే పునారవృతం అవుతోందని, దేశంలో ప్రజాసంక్షేమం కరువైందన్నారు. లేబర్‌కోడ్ వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపు తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదా నికి, పాసిజానికి వ్యతిరేకంగా అన్ని కులాలు, మతాలు, ప్రాంతాలను ఐక్యం చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, తన పంటను రైతే రోడ్డుపై పారబోసి తగలబెట్టు కోవాల్సిని పరిస్థితిని నేటి బూర్జవ పాలకు లు తీసుకొచ్చారని విమర్శించారు. కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ బిజెపి అబద్దాలతోనే అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటి సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, జనార్ధన్,టి.సుబ్రమణ్యం, నాయకులు సాయిలక్ష్మీ, జయచంద్ర, ఆర్. లక్ష్మీ, వేణుగోపాల్, మాధవ్, హరినాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

11 నెలల్లో రూ.250 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి సాయం

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం - ఆంధ్రనాడు, మే 8: కేవలం 11నెలల్లో 250 కోట్ల రూపాయలు పేదల ఆరోగ్యం కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన సాయమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 11మందికి 13.34 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ 11నెలల కాలంలోనే కోటిన్నర లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం విషయంలో చాలా ఉదారంగా స్పందిస్తున్నారని.. అందుకే ఇప్పటికే 250కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందించారన్నారు. గత ప్రభుత్వంలో తమ పార్టీ వారికే సీఎంఆర్ఎఫ్ సాయం అరకొరగా ఉండేదన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ బిల్లులు కూడా చెల్లించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఇప్పుడు ఆ బిల్లులన్నీ ముఖ్యమంత్రి చెల్లించి పేదలకు వైద్యం అందేలా చూస్తున్నారన్నారు. ఎవరికైనా అత్యవసర సమయాల్లో ఎల్ఓసీ ద్వారా కూడా సాయం చేస్తున్నారన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం జిల్లా అంటే ప్రత్యేక అభిమానం అని అందుకే ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. శుక్రవారం రోజు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గతంలో శ్రీశైలం నుంచి 50టీఎంసీలు నీరు వచ్చేదని ఇప్పుడు వంద టీఎంసీలు తీసుకురావాలని కాలువను డబుల్ చేస్తున్నారన్నారు. అలాగే జీడిపల్లి నుంచి లైనింగ్ చేస్తూ అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చూస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో హంద్రీనీవా ప్రాజెక్టు విషయంలో కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని దగ్గుపాటి విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ప్రారంభం వంటివి చేశారన్నారు. గాంధీ జయంతి లోపు అనంతపురంలోని డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని.. అలాగే డంపింగ్ యార్డుకు స్థల సేకరణ కూడా పూర్తైందన్నారు. దాదాపు 3లక్షల టన్నుల చెత్త క్లియర్ చేయాల్సి ఉందన్నారు.ద

మరువ వంక, నడిమి వంక ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. అమృత్ స్కీం కింద 85కోట్ల పీఏబిఆర్ నుంచి తాగునీరు అందించే పనులు వేకంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, కార్పొరేటర్ బాలాంజనేయులు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, మాజీ కార్పొరేటర్ వడ్డే సరళ, టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, దత్తాత్రేయాల కమిటీ చైర్మన్ రాయల్ మధు, మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జేయం బాషా,బీసీ సెల్ నగర అధ్యక్షుడు గోపాల్ గౌడ్, టిడిపి నాయకులు నారాయణస్వామి యాదవ్, ఈడిగ నాగభూషణం టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సాయాన్ని జీవితంలో మరువలేం

నా కుమారుడికి బోన్ ఇన్ఫెక్షన్ తో ఎంతో ఇబ్బందులు పడ్డాం. ఆరోగ్యశ్రీ వర్తించక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు తీసుకున్నాం. ఇందుకు రూ.1.30లక్షలు ఖర్చైంది. అప్పులు చేశాం. ఇలాంటి సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మాకు సాయం అందించారు. కష్టకాలంలో 55వేలు సాయం అందింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు అందించిన ఈ సాయాన్ని ఎప్పటికీ మరువలేం. ఎమ్మెల్యే దగ్గుపాటికి కూడా మా కృతజ్ఞతలు.

- రజియా, 5వ రోడ్డు

సీఎం గారు మిమ్మల్ని ఎప్పటికీ మరువలేం

మా నాన్న షేక్ రహీం గారికి బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో సర్జరీ చేశారు. అయినా మా నన్నని బ్రతికించుకోలేకపోయాం. ఇందుకోసం రూ.4.50లక్షలు ఖర్చైంది. చాలా అప్పులు చేశాం. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రూ.1.58లక్షలు అందించారు. సీఎం గారిని ఎప్పటికీ మరువలేం. **- నదీమ్, మున్నానగర్**

మనసున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు

నా భర్త సూర్యప్రకాష్ కి హార్ట్ స్ట్రోక్ వచ్చింది. సమస్య చాలా కష్టంగా ఉందని చెప్పారు. బెంగళూరుకి తీసుకెళ్లాం. అక్కడ ఆపరేషన్ చేశారు. అయినా ఆయన చనిపోయారు. కానీ మాకు 4లక్షల రూపాయల వరకు ఖర్చు వచ్చింది. మా పిల్లలు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఎంతో మంచి మనసుతో స్పందించి.. రూ.1.41లక్షలు అందించారు. ఈ సాయాన్ని ఎప్పటికీ మరువలేం. ముఖ్యమంత్రి గారికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- భాగ్యలక్ష్మి, అనంతపురం

అప్పుల్లో మునిగిపోయేవాడిని

నా కుమారుడు చీమల రాఘవకు రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేర్చాం. దాదాపు రూ.9.50లక్షలు ఖర్చైంది. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వద్దకు వెళ్లాం. వెంటనే ఆయన స్పందించి.. సీఎంఆర్ఎఫ్ కోసం పంపించారు. చంద్రబాబు గారు మా బాధల్ని అర్థం చేసుకుని.. రూ.3.17లక్షలు సాయం అందించారు. ఇంత సాయం చేస్తారని నేను ఊహించలేదు. ముఖ్యమంత్రి గారు సాయం చేయకపోయి ఉంటే.. అప్పుల్లో ఉండేవాడిని. ఎప్పటికీ ఆయన రుణం తీర్చుకోలేను...

- చీమల నగేష్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

పామిడి -ఆంధ్ర నాడు, మే 8: వాసవి కళ్యాణ మండపం(అమ్మవారి శాల),పామిడి నందు ఈనెల 11-05-25 ఆదివారం రోజున లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ మరియు లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు .బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితముగా ఆపరేషన్లు చేస్తారు .శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లైన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు .ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు మరియు పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపత నాయుడు మరియు రఘువీర్ కోరారు.

పీఆర్ డీఈఈగా జింకల కృష్ణజ్యోతి బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం - ఆంధ్ర నాడు, మే 8 : అనంతపురం పంచా యతీ రాజ్ శాఖ సబ్ డివిజన్-2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ)గా జింకల కృష్ణజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ క్యాంపస్ లోని సబ్ డివిజన్ కార్యాలయంలోని డీఈఈ ఛాంబర్ లో ఆమె బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆమె ఎస్.ఈ జహీర్ అస్లామ్, ఈఈ ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తరువాత ఆమె ఛార్జ్ తీసుకున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కృష్ణజ్యోతిని రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఏపీజేఏసీ- అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్ రావు, డీఈఈలు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, బెటాలియన్ పోలీస్ అధ్యక్షుడు తలారి పెద్దయ్య, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్

నియామకాలపై విచారణ పూర్తి

ఆంధ్రనాడు కథనంపై స్పందించిన ప్రభుత్వం

ఆంధ్రనాడు

అనంతపురం వైద్యం - ఆంధ్రనాడు మే 08 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ 2023లో ల్యాబ్ టెక్నీషియన్ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల ఉల్లంఘనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. ఈ అంశంపై ఆంధ్ర నాడు పత్రిక మార్చి 24 తేదీన వెలువరించిన కథనాన్ని పరిశీలించిన ప్రభుత్వం, స్పందనగా సెకండరీ హెల్త్ డైరెక్టర్ విచారణకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో, అనపర్తి ఏరియా ఆసుపత్రికి చెందిన జె.వి.ఎల్.ఎం పద్మశ్రీ (విచారణాధికారి) నేతృత్వంలో, అదే ఆసుపత్రికి చెందిన కే. రమాకాంత్ రెడ్డి (ఆఫీసు సూపరింటెండెంట్) మరియు తుని ఏరియా ఆసుపత్రికి చెందిన రాజా సభ్యులుగా ముగ్గురితో కూడిన విచారణ బృందం ను ఏర్పాటు చేశారు. గురువారం ఈ బృందం అనంతపురం జిల్లా డి.సి.హెచ్.ఎస్. కార్యాలయంలో విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా ఆరుగురు ఉద్యోగులను విచారించారు. వారిలో పరిపాలనాధికారి ఉదయ్ భాస్కర్, సాయి చరణ్, నాగార్జున, ఎర్రిస్వామి, డి.సి.హెచ్.ఎస్ ఉన్నారు. విచారణ బృందం సభ్యులు మాట్లాడుతు విచారణలో సేకరించిన ప్రాథమిక ఆధారాలను, నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపనున్నట్లు విచారణ బృందం వెల్లడించింది. తదుపరి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు. ఆంధ్ర నాడు పత్రికలో వచ్చిన కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించడాన్ని ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగులు స్వాగతిస్తున్నారు. అయితే ఈ నియామక ప్రక్రియ యొక్క పారదర్శకతపై పలు అనుమానాలు ఇంకా కొనసాగుతున్నాయి. అధికారులు ఈ విచారణను నిష్పక్షపాతంగా పూర్తి చేసి, ఒకవేళ ఏమైనా తప్పులు జరిగి ఉంటే అందుకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజమైన అర్హులకు న్యాయం చేకూరుస్తుందని అందరూ ఎదురు చూస్తున్నారు. అయితే ఈ వ్యవహారం రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్ఫూర్తితో కల్వర్టుల నిర్మాణం

అనంతపురం క్రైం - ఆంధ్రనాడు, మే 8 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 విధానం ఆదర్శంతో, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్ఫూర్తితో 42వ డివిజన్ టిడిపి నాయకుడు ఓంకా రెడ్డి తన సొంత నిధులతో 42వ డివిజన్ (టీవీఎస్ షోరూమ్ వెనుక భాగం) నందు రెండు కల్వర్టులను నిర్మించడం జరిగింది. గత కొంతకాలంగా ఈ కల్వర్టులు శిథిలావస్థకు చేరుకోవడంతో డివిజన్ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, వయోవృద్ధులు రోడ్డు దాటడానికి కూడా అనేక ఇబ్బందులు పడేవారు. ఈ విషయం గమనించిన టిడిపి నాయకుడు ఓంకార్ రెడ్డి తన సొంత నిధులు 60 వేల రూపాయలతో పాత కల్వర్టుల స్థానంలో నూతనంగా రెండు కల్వర్టులను నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా ఓంకార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి4 విధానం ఆదర్శంతో, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్ఫూర్తితో తాను కల్వర్టుల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 42 డివిజన్ బోయ రాము, భూత్ ఇన్చార్జులు రామాంజనేయులు, బోయ శ్రీనివాసులు, మెడికల్ బాబా, డిఎం భాష, చంద్రమౌళి నాయుడు డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు ప్రతిఒక్కరూ మద్దతివ్వాలి

అనంతపురం క్రైం - ఆంధ్రనాడు, మే 8: పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై అనంతపురం టిడిపి నాయకులు రామకృష్ణ స్పందించారు. భారత సైన్యం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిందనీ తెలియజేశారు టిడిపి నాయకులు రామకృష్ణ. ఈ విజయాన్ని ప్రజలతో పంచుకోవడం దేశ బాధ్యత, అని ఆయన అన్నారు. అలాగే, దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న బిజెపి : కెఎ.పాల్

అనంతపురం - ఆంధ్రనాడు, మే 7: దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రంలోని బిజెపి పాలన కొనసాగుతోందని ప్రజాశాంతి వ్యవస్థాపకుడు కెఎ.పాల్ అభిప్రాయ పడ్డారు. గురువారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఆయన అనంత ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల అడుగులకు మడుగులు వత్తేలా చంద్రబాబు, పవన్, జగన్‌లు రాష్ట్రంలో ఉండడం విచాకరం అన్నారు. రాయలసీమ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)కి సంబంధించిన ఎఫ్‌సిఆర్ఎ రెన్యూవల్ కాకుండా కేంద్రం అడ్డుకోవడం సరికాదన్నారు. రెండు నెలల్లోపు రెన్యువల్ ప్రక్రియ చేయకపోతే ఈ విషయంలో తానే చొరవ చూపి దీనిని పూర్తి చేయిస్తానన్నారు. ప్రపంచ దేశాల నుంచి సాయం తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు తనకు ఉన్నాయని దేశం, రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి అందిస్తానన్నారు. ఇటీవల మరణించిన ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆయన మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం చేసి నిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధం ఆపడానికి తాను పాకిస్తాన్ వెళుతున్నట్లు తెలిపారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733